క్లుప్తంగా

హౌసింగ్ ఏఈగా నాగశేఖర్

గోస్పాడు: హౌసింగ్ ఏఈగా నాగశేఖర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏఈ లేక దాదాపు నాలుగు సంవత్సరాలుగా ఖాళీగా ఉంది. ఆ పోస్టులో సచివాలయానికి చెందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్ హరి ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహించేవారు. అయితే ప్రస్తుత బదిలీల్లో భాగంగా శిరివెళ్ల ఏఈగా పనిచేస్తున్న నాగశేఖర్‌ను ఉన్నతాధికారులు ఇక్కడికి బదిలీ చేశారు. ఈ మేరకు విధుల్లో చేరిన ఆయన స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధిస్తామని తెలిపారు.

రుద్రవరం ఫారెస్టర్‌గా ఖాశీం నాయక్



రుద్రవరం: స్థానిక ఫారెస్టు సెక్షన్ అధికారిగా ఖాశీం నాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు.ఇటీవల ఉన్నతాధికారులు చేపట్టిన బదిలీల్లో భాగంగా గాజులపల్లె కలప డిపోలో విధులు నిర్వహిస్తున్న ఆయనను రుద్రవరం ఫారెస్టర్‌గా బదిలీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధ్యతలు చేపట్టినట్లు చెప్పారు.

ఆర్థిక సాయం

నంద్యాల(న్యూటౌన్): ఇటీవల మృతి చెందిన భాషోపాధ్యాయుడి కుటుంబానికి రూ.46,500 ఆర్థిక సాయం అందజేసినట్లు భాషోపాధ్యాయ సంఘం సంస్థ జిల్లా అధ్యక్షుడు కన్నయ్య, ప్రధాన కార్యదర్శి హుసేన్‌మియా గురువారం తెలిపారు. పట్టణంలోని సలీమ్‌నగర్‌లో నివసిస్తున్న ఖలీల్ అహమ్మద్ అవుకు మండలం సంగపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ సహాయకులుగా పనిచేస్తున్నారు. గత నెలలో మృతి చెందడంతో ఆ కుటుంబానికి అండగా నిలవాలని ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. సంస్థ నాయకులు రబ్బాని, లింగమయ్య, విశ్వనాథరెడ్డి, నబిసా, జాఫర్, అన్నెంశ్రీనివాసరెడ్డి,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎవరైనా బెదిరిస్తే సమాచారమివ్వండి

దొర్నిపాడు: నూతన మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసుకునే వారిని ఎవరైనా బెదిరిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోవెలకుంట్ల ఎక్సైజ్ ఎస్ఐ సందీప్‌యాదవ్ సూచించారు. గురువారం మండలకేంద్రం దొర్నిపాడులో నూతన మద్యం పాలసీ విధానంపై అవగాహన కల్పించారు. ఇప్పటి వరకు దొర్నిపాడు దుకాణానికి 15 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. 11వ తేదీ వరకు గడువును పెంచినట్లు చెప్పారు. 14న కలెక్టరేట్ లక్కీడిప్ ఉంటుందని పేర్కొన్నారు.

సదరం స్లాట్ బుకింగ్ ప్రారంభం

దొర్నిపాడు: అంగవైకల్య నిర్ధారణ పరీక్షల కోసం స్లాట్ బుకింగ్ ప్రారంభమైందని ఎంపీడీఓ సావిత్రి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి ఎంపిక చేసిన అన్ని ఆసుపత్రుల్లో వైద్యపరీక్షలు ప్రారంభం అవుతాయన్నారు. డిసెంబర్ వరకు కొనసాగుతాయని, మీసేవ, గ్రామ సచివాలయల్లో స్లాట్ బుక్ చేసుకోవచ్చన్నారు. ఆధార్‌కార్డుకు తప్పనిసరిగా మొబైల్ నంబర్ లింక్ అయి ఉండాలని పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రతన్ టాటా మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా మృతి బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని వైఎస్సార్ సీపీ జేసీఎస్ పట్టణ అధ్యక్షుడు, విద్యార్థి విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ సాయిరాంరెడ్డి అన్నారు. గురువారం ట్టణంలో రతన్ టాటా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భారత ఆర్థిక అభివృద్ధిలో తనదైన పాత్ర పోషించారని కొనియడారు.సంపత్, శీను, శంకర్ పాల్గొన్నారు.

రాయితీ నూనెలను సద్వినియోగం చేసుకోవాలి



నూనె ప్యాకెట్లను వినియోగదారులకు అందజేస్తున్న డీఎస్‌ఓ వెంకటరాముడు

నంద్యాల(అర్బన్): రాయితీపై రాష్ట్ర ప్రభుత్వం అందించే నూనెలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి డీఎస్‌ఓ వెంకటరాముడు సూచించారు. పౌర సరఫరాశాఖ కమిషనర్ సూచనలు, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం శ్రీనివాసనగర్ రైతుబజార్‌లో సరసమైన ధరలకు నాణ్యమైన నూనె విక్రయాలను డీఎస్‌ఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామాయిల్ లీటర్ రూ.121, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.129లకే విక్రయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎస్ డీటీ ప్రసాదరావు, ఆయిల్ మిల్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు గ్రహణం

- మార్చి నాటికి పూర్తిచేయాలని డెడ్ లైన్
- ఇసుక కొరతతో ఇబ్బందులు
- పెరిగిన మెటీరియల్ ధరలు
- ముమ్మరంగా వ్యవసాయ పనులు
- ఆందోళనలో లబ్ధిదారులు

వైఎస్సార్‌సీపీ హయాంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. రుద్రవరం మండలానికి 924 పక్కా గృహాలు మంజూరు కాగా.. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80లక్షలు మంజూరు చేస్తామని ప్రకటించింది. ఎన్నికల సమయంలో బిల్లులు విడుదల కాకపోవడం, వివిధ సమస్యల కారణంగా నిర్మాణాలు అకస్మాత్తుగా నిలిచిపోయాయి. ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంతో కూటమి ప్రభుత్వం వచ్చే ఏడాది మార్చి నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని, లేకపోతే బిల్లులు విడుదల చేయమని స్పష్టం చేసింది. అయితే నిర్మాణాలకు అవసరమైన ఇసుక అందుబాటులో లేకపోవడం, నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడంతో పాటు ప్రస్తుతం వ్యవసాయ పనులు జోరుగా సాగుతుండటంతో నిర్మాణాలు అనుకున్నంత త్వరగా పూర్తి చేసే అవకాశం లేదని లబ్ధిదారులు పేర్కొంటున్నారు.



ఎల్లావత్తులలో అసంపూర్తిగా ఇంటి నిర్మాణం

రుద్రవరం : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన ఇళ్లన్నీ 2025 మార్చి31 నాటికి పూర్తి చేసుకోవాలని, లేదంటే బిల్లులు రావని కూటమి ప్రభుత్వం డెడ్ లైన్ విధించింది. దీంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. ఓ వైపు ఇసుక కొరత, మరో వైపు వ్యవసాయ పనులు ఉండగా గృహ నిర్మాణాలు గడువులోపు ఎలా పూర్తి చేసుకోవాలని ప్రశ్నిస్తున్నారు. మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో లే అవుట్లు సిద్ధం చేసి అర్హులందరికీ ఇంటి పట్టాలు ఇచ్చి స్థలాలను కేటాయించారు. వాటిల్లో, సొంత స్థలాలు ఉన్న చోట గృహ నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అప్పట్లో ఒక్కో ఇంటి నిర్మాణానికి హౌసింగ్, ఉపాధి పథకం కింద కలిపి రూ.1.80లక్షలు మంజూరు చేశారు. మండలంలో మొత్తం 924 పక్కా గృహలు మంజూరు కాగా వాటిల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టారు. అయితే కొందరు పూర్తి చేసుకోగా మరి కొందరు వివిధ దశల వరకు నిర్మించుకున్నారు. సాధారణ ఎన్నికలు రావడంతో అప్పట్లో కూటమి ప్రభుత్వం ప్రకటించిన హామీల్లో ఇసుక ఉచితం అని ప్రకటించడంతో లబ్ధిదారులు నిర్మాణాలను ఆపేశారు. అలాగే బిల్లుల మంజూరు నిలిచిపోవడం కూడా సమస్యగా మారింది. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఉచితంగా ఇసుక లభించకపోవడంతో నిర్మాణాలు పునః ప్రారంభం కాలేదు. ప్రస్తుతం మార్కెట్లో ఒక్కో ట్రాక్టరు ఇసుక రూ.14వేలు పలుకుతోంది. వాటికి తోడు అధికారులు మన ఇల్లు మన గౌరవం పేరుతో గ్రామ సభలు ఏర్పాటు చేసి 2025 మార్చి 31లోపు గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని గడువు విధించారు. వ్యవసాయ పనులు జోరుగా సాగుతుండటం, ఇసుక లేక నిర్మాణాలు ఎలా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులు మదనపడుతున్నారు.



అలమూరులో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

రుద్రవరం మండలంలో గృహ నిర్మాణల వివరాలు..

గ్రామసచివాలయం	మంజూరు	బీబీఎల్	పీజీ	బీఎల్	ఎల్ఎల్	ఆర్ఎల్	ఆర్సీ	పూర్తిగృహాలు
ఆలమూరు	75	14	1	5	0	7	0	45
చిన్నకంబలూరు	39	12	0	1	0	0	0	25
చిత్రేనిపల్లె	65	13	0	4	0	3	2	43
కోటకొండ	45	4	0	0	0	0	0	41
మందలూరు	100	8	4	3	1	8	4	72
ముత్తలూరు	61	0	0	3	2	1	1	54
నర్సాపురం	53	0	1	5	1	1	5	39
పెద్దకంబలూరు	82	24	1	11	0	2	2	40
పేరూరు	79	5	8	4	0	4	1	57
ఆర్.నాగులవరం	62	20	2	2	2	3	4	26
రుద్రవరం- 1	14	1	0	2	1	1	2	7
రుద్రవరం-2	30	2	0	0	0	4	3	20
రుద్రవరం-3	3	0	0	0	0	0	0	3
శ్రీరంగాపురం	45	4	1	0	0	0	0	40
ఎల్లావత్తుల	47	1	0	1	2	4	2	37
ఎర్రగుడిదిన్నె	124	32	0	5	1	4	6	76

మండలంలో మొత్తం 924 గృహాలు మంజూరు కాగా 625 గృహాలు పూర్తయ్యాయి. మిగిలిన 299 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి.వాటిని పూర్తి చేసుకునేందుకు ఇసుక ప్రధాన సమస్యగా మారింది. పక్కా గృహాలతో పాటు మండలంలో ఆరు అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు మంజూరు కాగా అవి కూడా ఇసుక సమస్యతో అసంపూర్తిగానే మిగిలిపోయాయి.

ఇసుక అందేలా చర్యలు తీసుకోవాలి



గృహ నిర్మాణాలు నిర్ణీత గడువులోగా పూర్తి కావాలంటే ముందు ఇసుక అందుబాటులోకి రావాలి. కాస్తో కూస్తో ఉన్న సొమ్ము ఇసుకకే పోతే ఇంటి నిర్మాణానికి సంబంధించి మెటీరియల్ కొనుగోళ్లు, గడేకార్ల కూలీలు చెల్లింపులకు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ప్రభుత్వం ఉచిత ఇసుక అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు గడువును మరింత పెంచితే నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు వీలు ఉంటుంది. ప్రస్తుతం పొలాల్లో వ్యవసాయ పనులు కూడా అధికంగా ఉన్నాయి. ఇక నిర్మాణాలకు ఉపయోగించే సామగ్రి ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రభుత్వం ఇచ్చే మొత్తం ఏపాటికీ సరిపోదు.

– నబీసాబ్,ఆలమూరు

రెడ్డి కార్పొరేషన్ చైర్మన్‌ను నియమించాలి

నంద్యాల(అర్బన్): రాష్ట్రంలో 70లక్షలకు పైగా రెడ్డి సామాజిక వర్గం ఉందని, 80 శాతం మంది పేద, మధ్యతరగతి వారు ఉన్న రెడ్డి సామాజిక వర్గానికి కార్పొరేషన్ చైర్మన్‌ను నియమించాలని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ జయభారత్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో కోరారు. రెడ్ల సంక్షేమం కోసం కార్పొరేషన్ చైర్మన్‌ను నియమించి నిధులు కేటాయించాలన్నారు. రైతులకు సబ్సిడీ ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలు,పరికరాలు, స్వయం ఉపాధి, సహాయక రంగాల్లో చేయూత, రక్షణ నిధి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

సర్వేంద్రియానాం.. నయనం ప్రధానం



వృద్ధురాలికి కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

శిరివెళ్ల: సర్వేంద్రియానాం నయనం ప్రధానమని జిల్లా అంధత్వ నివారణ సంఘం అధికారి డాక్టర్ కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లమల అటవీ ప్రాంతంలోని పచ్చర్లలో ప్రపంచ దృష్టి దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చెంచులకు కంటి వైద్య పరీక్షలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఏటా అక్టోబర్ రెండవ గురువారం తప్పనిసరిగా దినోత్సవం జరుపుతున్నామన్నారు. ప్రతి ఒక్కరు తమ కళ్లను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. దృష్టి లోప నివారణకు ఆకుపచ్చని ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు, పౌష్టికాహారం కలిగిన పదార్థాలను తీసుకోవాలని సూచించారు. ఆశా వర్కర్ రజియా, అంగన్‌వాడీ కార్యకర్త రామలక్ష్మీ పాల్గొన్నారు.

16న మండల సర్వసభ్య సమావేశం

శిరివెళ్ల: ఈ నెల 16వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప గురువారం తెలిపారు. ఎంపీపీ నాయక్ అధ్యక్షతన జరగనున్న సమావేశంలో తాగునీరు, విద్యా, వైద్య, రవాణా, వ్యవసాయం, ఉపాధి, పంచాయతీలు, రెవెన్యూ, హౌసింగ్, విద్యుత్, సాగునీరు తదితర రంగాలపై చర్చ జరుగుతుందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచు, ఆయా శాఖల మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు విధిగా హాజరు కావాలని కోరారు.

ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి సారించండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ఉపాధి హామీ పథకం కింద వేతనదారుల మొబిలైజేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఏపీఓ, క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎస్‌బీసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన లేబర్ బడ్జెట్, హార్టికల్చర్, అవెన్యూ ప్లాంటేషన్, సంస్థాగత ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్, ఫారం పాండ్స్, రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ పనుల ప్రగతి లక్ష్యాలపై డ్వామా పీడీ జనార్దన్‌రావు కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్లస్టర్ల వారీగా సమీక్షించారు. లేబర్ బడ్జెట్ మొబలైజేషన్‌లో వెలుగోడు, జూపాడుబంగ్లా, పగిడ్యాల, బనగానపల్లె, సంజామల, నంద్యాల, ఉయ్యాలవాడ, చాగలమర్రి, గడివేముల మండలాలు వచ్చే వారానికి ప్రగతి చూపకపోతే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో వారమంతా కలిపి 54 వేల పనిదినాలే కల్పించారని, 1.5 లక్షల పది దినాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనెల 14వ తేదీ నుంచి పల్లె పండుగ – పంచాయతీ వారోత్సవాల్లో జిల్లా వ్యాప్తంగా మంజూరు చేసిన 1,026 పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో ప్రారంభించి గ్రౌండ్ చేయాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద ఇళ్ల నిర్మాణాలో జిల్లా దిగువ స్థానంలో ఉందని ఏఈ, డీఈలు ఉత్సాహంతో పనిచేసి ప్రగతి చూపాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని ఎస్‌బీసీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, ఈఈ శ్రీహరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత వారం 130 ఇళ్లు పూర్తి చేస్తామని చెప్పినప్పటికీ 99 మాత్రమే చేయగలిగారన్నారు. మిగిలిన లక్ష్యంతో కలిపి ఈవారం కూడా 129 గృహాలు పూర్తి చేయాలన్నారు. ఎన్టీఆర్ గృహ నిర్మాణం కింద పెండింగ్‌లో ఉన్న 6,315 మంది లబ్ధిదారుల పునః పరిశీలనను ఈనెల 17వ తేదీ లోపు పూర్తి చేయాలని చెప్పారు.

సంక్షిప్తం

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(అర్బన్): మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షణలో కొనసాగుతున్న సఖీ-1 స్టాఫ్ సెంటర్(మిషన్ శక్తి-సంబల్)లో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సాధికారత అధికారిణి లీలావతిదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సెంటర్ అడ్మినిస్ట్రేటర్, కేసు వర్కర్, పారా లీగల్ పర్సనల్, సైకో సోషల్ కౌన్సిలర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, సెప్టెంబర్ 26న జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఈనెల 19వ తేదీ వరకు దరఖాస్తు స్వీకరణ పొడిగించినట్లు పేర్కొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

దొర్నిపాడు:మండలంలోని చాకరాజువేముల గ్రామానికి చెందిన రెండు వర్గాల మధ్య గురువారం ఘర్షణ చోటుచేసుకుంది. ఓ స్థలం వద్ద బండలు పగుల గొట్టారనే ఘటనపై భాస్కర్‌రెడ్డితో పాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

నివాళి

శిరివెళ్ల: బోయలకుంట్లకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జింకల ప్రసాద్ అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు.

ఆళ్లగడ్డ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ఆళ్లగడ్డ: నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఫ్యాక్షన్ రాజకీయాలకు స్వస్తి చెప్పి పార్టీకి కట్టుబడి ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని చెప్పారు.

ప్రజల సహకారంతో దోమల నివారణ

ఆళ్లగడ్డ: దోమల నివారణకు ప్రజల సహకారం అవసరమని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి మలేరియా అధికారి శివచంద్రారెడ్డి అన్నారు. దోమల లార్వాలను నివారించడంలో భాగంగా గురువారం పట్టణ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు, నీరు నిలిచిన ప్రాంతాల్లో గంబూషియా చేపలు వదిలారు.వారు మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి

నంద్యాల(అర్బన్): వరి పైరులో చీడపీడల ఉనికిని తెలుసుకొనేందుకు రైతులు ప్రతి ఎకరాకు 6 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని నంద్యాల మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. వాటి ఉనికికి అనుగుణంగా పురుగు మందులు పిచికారీ చేసుకోవాలని చెప్పారు. మండలంలోని బిల్లలాపురం గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పసుపురంగు జిగురు అట్టలు ఏర్పాటు చేయడం ద్వారా పక్షులు స్థావరాలు ఏర్పాటు చేసుకుంటాయన్నారు. వరిలో సూక్ష్మధాతు లోప నివారణకు జింక్ సల్ఫేట్ రెండు గ్రాముల లీటర్ నీటితో పిచికారీ చేయాలన్నారు. పొలంలో నీటిని తీసివేసి మరుసటి రోజు నీటిని పెట్టుకోవడం ద్వారా సుడిదోమను తగ్గించుకోవచ్చన్నారు.

ఆర్టీసీ స్వీపర్లకు చీరల పంపిణీ

నంద్యాల(అర్బన్): దసరా పండుగను పురస్కరించుకొని ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న స్వీపర్లకు డీఎం గంగాధర్‌రావు గురువారం చీరలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కండక్టర్ భాగ్యలక్ష్మి సహకారంతో 20 మంది పారిశుద్ధ్య కార్మికులకు చీరలు అందజేశామని చెప్పారు. అసిస్టెంట్ డిపో మేనేజర్ మద్దిలేటినాయుడు పాల్గొన్నారు.

వీడని వాన.. రైతున్నకు కష్టం



అప్పనపల్లె వద్ద తడిసిన మొక్కజొన్న

రుద్రవరం: మండలంలో రెండు రోజుల నుంచి మధ్యాహ్న సమయంలో వర్షం కురుస్తోంది. దీంతో రైతులకు కష్టాలు తప్పడంలేదు. కొద్ది రోజులుగా ఖరీఫ్‌లో సాగు చేసిన మొక్కజొన్న, వేరుశనగ కోతలు జోరుగా సాగుతున్నాయి. దిగుబడులను ఆర్‌అండ్‌బీ రోడ్లపై ఆరబోసుకుంటున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండగా ఉంటుండటంతో ఎండబెడుతున్నారు. ఉన్న ఫలంగా వర్షం కురుస్తుండటంతో వాటిని తడవకుండా కాపాడుకునేందుకు రైతులు పడుతున్న అగచాట్లు వర్ణనాతీతం. గురువారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. గింజలపై పట్టలు కప్పుకున్నారు. మరి కొందరు ఇంటికి వెళ్లి వచ్చే లోపు మొక్కజొన్నలు తడిసిపోయాయి. అప్పనపల్లె సమీపంలో ఓ రైతు వేరుశనగ పీకి ఉంచారు. కాయలు కోయకముందే వర్షం కురిసింది. వెంటనే కాయలు కోయించకపోతే మొలకలు వచ్చే ప్రమాదముందని రైతు రామసుబ్బారెడ్డి వాపోయాడు. రుద్రవరం-కోటకొండ,రుద్రవరం-పెద్దకంబ లూరు,రుద్రవరం-నర్సాపురం దారుల్లో మొక్కజొన్నలు ఆరబోసిన రైతులు ధాన్యం తడవకుండా అవస్థలు పడ్డారు.




మహిషాసురమర్దిని అలంకారంలో కాళికాంబదేవి



బాలాజీ కల్యాణ మండపంలో దుర్గాదేవి, శక్తి పీఠాల ప్రతిమలు



సంజీవనగర్ రామాలయంలో దుర్గాదేవిగా కాశీవిశాలాక్షి



లలితాదేవి, మహాచండీదేవి అలంకారాల్లో కామేశ్వరి దేవి



దుర్గాదేవి అలంకారంలో వాసవీ మాత

మహిషాసురమర్దిని..పాహిమాం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో దసరా శరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా 8వ రోజైన గురువారం పలు దేవాలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలతో పాటు చండీ హోమాలు, గోపూజలు నిర్వహించి సాయంత్రం ప్రదోష కాల పూజ అనంతరం ప్రత్యేక మండపాల్లో మహిషాసురమర్దిని, దుర్గాదేవిగా అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు.

– కాళికాంబదేవస్థానంలో శ్రీకాళికాంబదేవికి ఉదయం పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి అమ్మవారిని స్వర్ణాభరణలతో అలంకరించారు. సాయంత్రం ప్రత్యేక మండపంలో అమ్మవారిని మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



నంద్యాల బాలాజీ కాంప్లెక్స్‌లో సామూహిక లక్ష కుంకుమార్చన



మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మహా చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

అమ్మవారి శాలలో..

స్థానిక మెయిన్‌బజార్‌లోని అమ్మవారిశాలలో వాసవీ కన్యకాపరమేశ్వరి మూలవిరాట్‌కు ఉదయం పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారిని విశేషాలంకరణ గావించారు. కలశస్థాపన, దేవీ పారాయణం, నవగ్రహ యంత్రజపాదులు, మూలమంత్ర జపాదులు, మహిళల సామూహిక కుంకుమార్చన చేపట్టారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేక మండపంలో మహిషాసురమర్దినిగా అలంకరించారు. బాలాజీ కాంప్లెక్స్‌లో సాయంత్రం ప్రత్యేక మండపంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శక్తి పీఠాల ప్రతిమలు ఆకట్టుకున్నాయి. సంజీవనగర్ రామాలయంలో శ్రీభగవత్‌సేవా సమాజ్ ఆధ్వర్యంలో లక్ష్మీవెంకటేశ్వరస్వామికి సుప్రభాతసేవలు, పంచామృతాభిషేకాలు, ఉత్సవ మూర్తులకు తిరుమంజన సేవలు నిర్వహించారు. శివాలయంలోని కాశీవిశ్వనాథునికి, విశాలాక్షికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం 11 హోమగుండాలతో మహాచండీ యాగం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు.

బ్రహ్మనందీశ్వరస్వామి దేవస్థానంలో..

బ్రహ్మనందీశ్వరస్వామికి ఉదయన్నే మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, పార్వతీదేవికి పంచామృతాభిషేకాలు చేపట్టారు. మహానందీశ్వర కామేశ్వరి సహిత ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ గావించారు. సాయంత్రం అమ్మవార్లను శ్రీలలితాదేవి, శ్రీమహాచండీదేవిలుగా అలంకరించారు. మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో దుర్గాదేవి విగ్రహాన్ని నెలకొల్పి విశేష పూజలు గావించారు. అమ్మవారిని కాళరాత్రిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగజ్జననీ ఆలయంలో మొదటిరోజు అమ్మవారి మాలాధారణ ప్రారంభించారు. కాశిరెడ్డినాయన ఆశ్రమంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. బాల్కొండ హాల్ వీధిలో దుర్గాదేవి విగ్రహానికి పూజలు చేశారు. రెవెన్యూ క్వార్టర్స్ మహిషాసురమర్దినిగా అమ్మవారు దర్శనమిచ్చారు.



భద్రావతి భావనారుషి ఆలయం లో మహాగౌరీదేవిగా అమ్మవారు



దుర్గాదేవి అలంకారంలో టెక్కే సుంకులాపరమేశ్వరి



పసురపాడులో దుర్గాదేవి అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

ఆళ్లగడ్డ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాష్టమిని పురస్కరించుకుని గురువారం అమ్మవారి ఆలయాల్లో అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించారు.స్థానిక అమ్మవారిశాలలో ఉదయం ఆర్యవైశ్య మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం వాసవీ మాతను మహిషాసురమర్దినిగా అలంకరించి భక్తుల దర్శనార్థం కొలువుంచారు.

ఉయ్యాలవాడ: మండలంకేంద్రంలో అమ్మవారు కాళికాదేవిగా, ఇంజేడులో చౌడేశ్వరీదేవి అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

చాగలమర్రి: ముత్యాలపాడు గ్రామంలో గురువారం రాత్రి దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్ర లక్షకుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు.

దొర్నిపాడు: శరన్నవరాత్రులను పురస్కరించుకొని స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారు గురువారం బాలాత్రిపురసుందరీదేవిగా భకులకు దర్శనం ఇచ్చారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అంజనీ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.

గోస్పాడు: మండల కేంద్రంతో పాటు పసురపాడు, యాళ్లూరు గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేశారు. 8వ రోజు గురువారం అమ్మవార్లు దుర్గాదేవి అలంకారంతో దర్శనమిచ్చారు.

రుద్రవరం: స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.



ఆళ్లగడ్డ: మహిషాసురమర్దిని అలంకరణలో వాసవీమాత



చాగలమర్రిలో మహిషాసుర మర్దినిగా



రుద్రవరంలో మహిషాసుర మర్దినిగా వాసవీమాత



ఉయ్యాలవాడలో కాళికా దేవిగా..



దొర్నిపాడులో బాలాత్రిపుర సుందరిగా అమ్మవారు